కార్తీక దీపోత్సవం ఏర్పాట్లపై జెఈవో సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటి కార్తీక మాసంలో నవంబరు 20 నుండి పలు ప్రాంతాల్లో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ జెఈవో సదా భార్గవి సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గహంలో బుధవారం మధ్యాహ్నం ఈ సమావేశం జరిగింది. జెఈవో మాట్లాడుతూ గత ఏడాది తరహాలోనే నవంబర్ 20న తిరుపతిలో టీటీడీ పరిపాలనా భవనం వెనుక ఉన్న పరేడ్ గ్రౌండ్స్‌లో కార్తీక దీపోత్సవాలను ప్రారంభిస్తామని, నవంబర్ 27న కర్నూలులోని ఎపిఎస్‌పి గ్రౌండ్స్‌లో, డిసెంబర్ 11న విశాఖలోని ఆర్‌కె బీచ్‌లో గల శ్రీ కాళీమాత ఆలయానికి ఎదురుగా దీపోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. రెండేళ్లుగా దాతల సహకారంతో దీపోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది తిరుపతిలో 2 వేల మంది, మిగిలిన రెండు చోట్ల 3 వేల మందిని అంచనా వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన శ్రీ వేణుగోపాల దీక్షితులు, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, డెప్యూటీ ఈవోలు లోకనాథం, సుబ్రహ్మణ్యం, విజివో బాలిరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, టీటీడీ పాఠశాలల విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను సందర్శించి కొత్త విషయాలను నేర్చుకోవాలని టీటీడీ జెఈవో సదా భార్గవి కోరారు. కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై తిరుపతిలోని శ్వేత భవనంలో బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఈవో మాట్లాడుతూ గ్రంథాలయాల్లో మనకు తెలియని కొత్త విషయాలను చాలా నేర్చుకోవచ్చని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లడాన్ని అలవాటుగా మార్చుకోవాలని కోరారు. టీటీడీ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఒకరోజు లైబ్రరీ క్లాస్ ప్రారంభించాలని, ఇందులో ఒక గంట సేపు విద్యార్థులు గ్రంథాలయంలో గడిపేలా చూడాలని చెప్పారు. గ్రంథాలయంలో ఏదైనా ఒక అంశానికి సంబంధించి పుస్తకాలను ఎలా వెతకాలి అనే విషయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్వేత భవనంలో గల కేంద్ర గ్రంథాలయంలో వేదాలు, పురాణాలు, సాహిత్యం, చిన్నపిల్లల కథల పుస్తకాలు, పోటీ పరీక్షలు పుస్తకాలు తదితర ఆసక్తికరమైన అనేక పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులు తరచూ సందర్శించి జ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ధార్మిక ప్రవచనకర్త డా.సి.అనంతలక్ష్మి ధార్మిక, వ్యక్తిత్వ వికాస విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిఏవో శేషశైలేంద్ర, విద్యాశాఖాధికారి డా. ఎం.భాస్కర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ అధికారి జె.శివప్రసాద్ అనాన్రు. తిరుపతి శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సంస్థ ఛైర్‌పర్సన్ ఎన్.మధుబాల, డిఇఒ వి.శేఖర్ మాట్లాడుతూ నేటితరం, నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు, విశ్రాంతి ఉద్యోగులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సముపార్జన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణారెడ్డి చైతన్య ప్రిన్సిపాల్ జనార్ధన్, డాక్టర్ పి.గోపాల్, ఇంగ్లీష్ ట్రైనర్ ముషీర్ అహ్మద్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, వుయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్ తహసున్నీసా బేగం, ఎం.మునీంద్ర, పి.గోవిందరాజులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో... గ్రంథాలయ అధికారిణి మీనాకుమారి ఆధ్వర్యంలో గ్రంథాలయ పోటీ పరీక్షలు, సైన్స్ మార్టిన్ పుస్తకాల ప్రదర్శన జరిగింది. పుస్తక ప్రదర్శనను సంస్థ ఛైర్మన్ నైనారు మధుబాల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుజాల్ పాల్గొన్నారు.

రేణిగుంటలో... మంచినీళ్ళ గుంట వద్దనున్న గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా సర్పంచ్ నగేష్ పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నం, ఉపాధ్యాయులు, విశాంత్రి వార్డ్ మెంబర్ పాల్గొన్నారు. భగవద్గీతను చదవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని పరిపాలనా అధికారి డివిస్ హరిబాబు అన్నారు. పుస్తక ప్రదర్శన ప్రారంభించి పుస్తక పఠనం విశిష్టతను వివరించారు. గ్రంథాలయ అధికారిణి శ్రీముఖి, సిబ్బంది రవి, మాణిక్యం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్న డిఇఒ

విజయవాడ మహాప్రదర్శన ర్యాలీలో తిరుపతి జిల్లా సిపిఎం నాయకత్వం

బిజెపిని గద్దె దింపాలి

'ప్రజారక్షణ భేరి' పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ, తిరుపతి బ్యూరో

వచ్చే ఏడాది 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని గద్దె దించకపోతే ఈ దేశానికే ప్రమాదమని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జాతీయ, రాష్ట్ర నాయకులు బివి రాఘవులు, పుణ్యవతి, ఎంఎ గఫూర్, పి.మధు, డి.రమాదేవి పిలుపునిచ్చారు. సిపిఎం ప్రజారక్షణ భేరి బహిరంగసభ బుధవారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబి స్టేడియంలో జరిగింది. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి ఆంధ్ర రాష్ట్రానికి కావాలంటూ విజయవాడ నుంచి సిపిఎం నాయకులు సమరభేరి మోగించారు. విజయవాడ కేంద్రంగా బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభకు తిరుపతి జిల్లా నుంచి పెద్ద ఎత్తున నాయకులు హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో మహా ప్రదర్శనలో పాల్గొన్నారు. జానపద వృత్తి కళాకారులు ప్రదర్శనలతో మోడీ, జగన్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సిపిఎం జిల్లా నేతలు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, టి. సుబ్రమణ్యం, ఒ.వెంకటరమణ, గంధం మణి, పెనగడం గురవయ్య, వేణు, సంక్రాంతి వెంకటయ్య, రాపూరు సుబ్రమణ్యం, ముకుంద తదితరులు పాల్గొన్నారు. తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట కేంద్రాల నుంచి వందలాది మంది పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు మహార్యాలీలో పాల్గొన్నారు.

వెండి ఉరువులు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి వెంకటగిరికి చెందిన బాలాజీ షాపింగ్ మాల్ అధినేత బాలాజీ కుటుంబ సభ్యులు బుధవారం రూ.2 లక్షలు విలువజేసే వెండి ఉరువులను వితరణగా అందజేశారు. ప్రతి ఏటా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో గురుదక్షిణ మూర్తికి వెండి ఉరువులను అలంకరించాలని దాతలు ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులను కోరారు.

తూకివాకం రికవరి ప్లాంట్స్ పరిశీలన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేస్ట్ మెటీరియల్‌ను రికవరి చేసే తూకివాకం మెటీరియల్ రికవరి ఫెసిలిటి(ఎం.ఆర్.ఎఫ్) సెంటర్‌ను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత డ్రై వేస్ట్ రికవరి ప్లాంట్ ను, తడి చెత్త నుండి ఎరువులు తయారు చేసే ప్లాంట్ ను అదేవిధంగా బయో మిథన్ గ్యాస్ ప్లాంట్ ను పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ఈ సందర్భంగా తడి చెత్త నుండి ఎరువులు తయారు చేసే నిర్వాహకులతో మాట్లాడుతూ ఎరువుల ఉత్పత్తి పనులు అనుకున్న రీతిలో తయారు చేయడం లేదని, మరింత మంది మనుషులను నియమించి తడి చెత్త నుండి మరింత పెద్ద మొత్తంలో ఎరువులు తయారు చేయాలన్నారు. ఎరువుల తయారీకి అవసరమైన తడి చెత్తను సేకరించి నిరంతరం అందిస్తామన్నారు. అదేవిధంగా డ్రై వేస్ట్ రికవరి ప్లాంట్ ను పరిశీలించి, పనుల వేగవంతానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మహేంద్ర కంపెని నిర్వహణలో పనిచేస్తున్న బయో మిథనైజేషన్ ప్లాంట్ ను పరిశీలిస్తూ సి.ఎన్.జి గ్యాస్ ఉత్పత్తికి అవసరమైన ఆహార వ్యర్థాలను, హోటళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను, మార్కెట్ల నుండి పాడైన కూరగాయలు, పండ్లను సేకరించి

ప్లాంట్ కి తరలించేలా తగు చర్యలు చేపడతామన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ నియమ నిబంధనల మేరకు అన్ని పదర్థాల నుండి రీ సైక్లింగ్ ద్వారా తిరిగి ఉపయోగంలోకి తీసుకు వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అనుభవానికి యువబలం తోడు

ఉమ్మడి లక్ష్యదిశగా టిడిపి, జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

టిడిపి నాయకుల అనుభవానికి జనసేన యువబలాన్ని జోడించి వచ్చే 120 రోజుల లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో యుద్ధానికి సన్నద్ధం కావాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం కపిలతీర్థం వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో జరిగిన జనసేన, టిడిపి సమన్వయ సమావేశంలో హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేన, టిడిపి కలయికను రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలు ఆహ్వానిస్తున్నారన్నారు. అన్నదమ్ముల కలయికలా రెండు పార్టీలు ఏకాభిప్రాయంతో ఉమ్మడిగా పనిచేయాలన్నారు. బలవంతుడైన రాక్షసున్ని ఓడించాలంటే ఈ కలయిక అనివార్యమన్నారు. ఇరు పార్టీలు ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ముందుకు సాగాలని కోరారు. ఇప్పటి వరకు ట్రెండ్ ను ఫాలో అయ్యామని, ఇకపై ట్రెండ్ సెట్ చేస్తామన్నారు. ఇక వైసిపి పతనం ఖాయమని, 2019 లో ఒక్క అవకాశం

అంటే ప్రజలు ఓటు వేశారన్నారని, ఇప్పుడు ఆ ఓటు వేసిన ఆ ప్రజలే కన్నీరు పెడుతున్నారన్నారు. ప్రజలు టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థులకే ఓటు వేయాలని ఫిక్స్ అయ్యారన్నారు. అధికార పార్టీ దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారన్నారు. ఏకపక్షంగా వైసిపి కండువాలు కప్పుకొని పనిచేస్తున్న వ్యవస్థలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్నది ప్రజా స్వామ్యమా, నియమనతత్వమా అని ప్రశ్నించారు. ఎన్నికలకు 120 రోజుల సమయం ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. తిరుమలలో అన్నం ప్రసాదంగా ఇస్తుంటే నీటిని మాత్రం 60 రూపాయలకు కొనాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, జనసేన తిరుపతి ఇంచార్జ్ కిరణ్, నగర అధ్యక్షులు రాజారెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతిస్తేనే భవిష్యత్ అభివృద్ధి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

సచివాలయం పరిధిలో 17 కోట్లు, వార్డు పరిధిలో 34 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని, నియోజకవర్గంలో 1600 కోట్లు ఖర్చుచేశామని, మళ్లీ జగనన్నకు మద్దతుగా నిలిస్తే తిరుపతి నగరాభివృద్ధి నిరాటంకంగా సాగుతుందని ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం బుధవారం కొర్లగుంట వద్ద జరిగింది. భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్క తిరుపతిలోనే 26వేల ఇళ్లను మంజూరు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లను విస్తరించామన్నారు. టిటిడి ఉద్యోగులు ఏడువేల మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. ఐదువేల మంది పారిశుధ్య కార్మికులకు ఒక్కసారిగా ఆరువేల రూపాయల వరకు జీతాలు పెంచామన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తూ, మూడు శాతం జీతాన్ని పెంచామన్నారు. ఎన్నికలకు ముందే తిరుపతిలో పారిశుధ్య సమస్యనూ పరిష్కరిస్తామన్నారు.

బాలాయపల్లిలో..

వెంకటగిరి రూరల్‌లో... జీకెపల్లి పంచాయతీ సచివాలయంలో వైసిపి మండల కన్వీనర్ కల్లీరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సచివాలయ పరిధిలో ఖర్చు చేసిన నిధుల డాష్‌బోర్డును ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన జోలిసంచెను వాలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, వైసిపి సీనియర్ నాయకులు జీకెపల్లి నాగయ్య, రాజారెడ్డి, విజయ, సాయిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాలాయపల్లిలో... జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం హస్తకావేరి, నాయునిచెరువు కండ్రిగ గ్రామాల్లో వైసిపి మండల అధ్యక్షులు, జయంపు సహకార సంఘం అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్రానికి జగనన్న ఎందుకు అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయం మండల అధ్యక్షులు తాళ్లూరు బంగారు ప్రసాది చౌదరి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీ పద్మావతి అమ్మవారు

ప్రజాశక్తి - తిరుచానూరు

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన బుధవారం రాత్రి అమ్మవారు శ్రీవారి బంగారు పాదాలు ధరించి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వాలు, వషభాలు, గజాలు ముందు కదులుతుండగా, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ ఆలయ నాలుగు మాడ వీధుల్లో రాత్రి 7 గంటలకు అమ్మవారి గరుడ వాహన సేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ఉదయం టిటిడి మహిళా అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం స్వర్ణరథంపై దర్శనమిచ్చారు. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, బోర్డు సభ్యులు సుబ్బరాజు, యానాదయ్య , జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, విజివో బాలి రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవం తిరుపతిలో వైభవంగా జరిగిందని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ డాక్టర్ ఎస్. సరోజనమ్మ తెలిపారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్ లో అబ్దుల్ కలాం 92వ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సామాజిక సేవా కార్యకర్తలు, పాత్రికేయులను గుర్తించి జ్ఞాపిక,

శాలువా, ప్రశంసాపత్రంతో గౌరవంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా కందుల నరహరి, ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ రమేష్ నాథ్, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ జి. దశరథ రెడ్డి, డాక్టర్ రాఘవరెడ్డి, రాస్ నాగరాజు, ఎన్. సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మందికి అబ్దుల్ కలాం జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్నారు.

'మనోహరి'లో కిడ్నీ క్యాన్సర్‌కు అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి -తిరుపతి సిటీ తిరుపతిలోని మనోహరి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ క్యాన్సర్ కు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ప్రముఖ న్యూరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ హర్ష తెలిపారు. స్థానిక రెడ్డి రెడ్డి కాలనీ లోని ఆ ఆసుపత్రి వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 25 సంవత్సరాల వయసు గల యువతకు కిడ్నీ క్యాన్సర్ కు పూర్తిగా లాప్రోస్కోపీ ద్వారా చికిత్స అందించడం జరిగిందన్నారు. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్స తిరుపతి మహానగరంలో ఇదే మొట్టమొదటిది అని వెల్లడించారు. ఎలాంటి కోతలు లేకుండా కేవలం లాప్రోస్కోపీ ద్వారా చికిత్స అందించడం ద్వారా రోగి కేవలం మూడు రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారన్నారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంతో ఉన్నారన్నారు. తమ ఆసుపత్రుల్లో లాప్రోస్కోపీ ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులకు, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక పద్ధతుల వైద్యం అందిస్తున్నామన్నారు.

'ఓయాసిస్'లో గర్భవతులకు సత్కారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్లో గర్భవతులకు బుధవారం సత్కారం నిర్వహించారు. స్థానిక ఎమ్ఆర్ పల్లి సర్కిల్లోని ఓయాసిస్ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భవతులకు సత్కారము సందర్భంగా ఓయాసిస్ ఫెర్టిలిటీ, కన్సల్టెంట్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ జాహ్నవి ఎసనాకుల మాట్లాడుతూ భారతదేశంలో లక్షలాది మంది సంతానం లేక బాధపడుతున్నారని పేర్కొన్నారు. దంపతులు సంతానం పొందడానికి అనేక చికిత్సలు అందుబాటులో కలవన్నారు. అయితే, దీనిపై ఎవరికీ పెద్దగా అవగాహన లేదన్నారు. దీంతో ఆశలు వదులుకుంటున్నారని పేర్కొన్నారు. అస్థిర జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, పీసీవోఎస్, ప్రసూతి వయస్సు పైబడటం తదితర గర్భధారణను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. సరైన సమయంలో సంతానోత్పత్తి నిపుణుల సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. తిరుపతి కేంద్రంలో 300 మంది తల్లులకు చికిత్స అందిస్తే 70 శాతం మంచి ఫలితాలు వచ్చాయన్నారు. డాక్టర్ భారతి, కార్పొరేటర్ సంధ్య పాల్గొన్నారు.

వర్షాలు పడితేనే సాగు చేయండి

ప్రజాశక్తి - బాలాయపల్లి

రైతులు డ్యాం నీళ్లపై ఆధారపడి పంటలు సాగు చేయవద్దని, ఈ సారి డ్యాంలో నీటి శాతం తక్కువగా ఉందని, నైరుతి రుతుపవనాలు చూసుకునే పంటలు వేయాలని ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వర్ధనం పద్ధతిలో 50 శాతం పాడి రైతులకు సబ్సిడీలో పేయి దూడలు పుట్టేలా ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపట్టిందన్నారు. గాలికుంటు వ్యాధికి ఉచితంగా మందులు వేస్తామన్నారు. గేదెలకు గర్భం నిలిచేందుకు బుస్‌లేషన్స్ వ్యాక్సిన్ వేస్తారన్నారు. పాత బిల్లులు ఎక్కడ? అని పాకపూడి గ్రామ సర్పంచి మల్లిమాల గోపీక్రిష్ణారెడ్డి ప్రశ్నించారు. ముందస్తుగా 50శాతం బిల్లులు ఇస్తేనే పనులు

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి

ప్రారంభిస్తామని తేల్చి చెప్పారు. తాగునీటి బోరు కాంట్రాక్టర్ వేస్తే క్వాలిటీ కంట్రోల్ నిర్లక్ష్యం చేసి ఆరు నెలలకు ఎంబుక్ చేశారని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ఎంపిపి భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. కయ్యూరు సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయని వెంగమాంబపురం ఎంపిటిసి చంద్రమౌళి అధికారులను ప్రశ్నించారు.

డ్రోన్ సాంకేతికతపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - కెవిబిపురం

మినుములో సమగ్ర సస్యరక్షణ, డ్రోన్ సాంకేతికతపై రైతులకు కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు.

కెవిబిపురం మండలం కళత్తూరు గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి మురళి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో సాగులో ఉన్న ప్రధాన పంటలు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, రైతు భరోసా కేంద్రం సేవల గురించి వివరించారు. సేద్య విభాగ శాస్త్రవేత్త దివ్య మాట్లాడుతూ మినుము ప్రదర్శనా క్షేత్రాలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో రాస్ కెవికె శాస్త్రవేత్తలు పద్మ, దివ్య, రాంకుమార్, వైస్ ఎంపిపి రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్ పాల్గొన్నారు.

మొక్కలు పెంపకంతో కాలుష్య నివారణ

ప్రజాశక్తి -ఏర్పేడు: మొక్కలు పెంచి కాలుష్యాన్ని నివారించాలని పుష్పిత్ స్టీల్ కంపెనీ సీఈవో బలరామిరెడ్డి పేర్కొన్నారు. ఆయన సూచనతో కాలుష్య నివారణకు మేర్లపాక గ్రామ పంచాయతీలో పుష్పిత్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో భారీ సంఖ్యలో బుధవారం మొక్కలు నాటారు. కంపెనీ సీఈవో బలరామిరెడ్డి ఆదేశాల మేరకు మేర్లపాక పంచాయతీ మొత్తం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించి, కాలుష్య నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ కె గంగాధర్ మాట్లాడుతూ మేర్లపాక గ్రామ పంచాయతీకి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న పుష్పిత్ స్టీల్ కంపెనీ సీఈవో బలరామిరెడ్డి అభినందనలు తెలిపారు. గతంలో నాటిన మొక్కలను, ప్రస్తుత పనులను సర్పంచ్ స్వయంగా వెళ్లి పర్యవేక్షించారు. మేర్లపాక గ్రామ ప్రజలందరూ కంపెనీ యాజమాన్యం చేపట్టిన ఈ కార్యక్రమంతో హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర కరాటే పోటీ విజేతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర కరాటే పోటీల్లో పుత్తూరు విద్యార్థికి తృతీయ స్థానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశాఖపట్నంలో ఈనెల 10వ తేదీ స్కూల్ గేమ్స్ కరాటే పోటీలలో 8 వ తరగతి విద్యార్థి ఎం భవ్యశ్రీ తృతీయ స్థానం సాధించిందని ప్రధానోపాధ్యాయులు రవి తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ లో ఎంపికైన నవీనకుమార్, జాఫర్ (అండర్ 17 (త్రో బాల్) పోటీల్లో పి నిరంజన సాయి, ఎస్‌వి భరత్ ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపికకు కృషి చేసిన సీనియర్ పీడీ జయదేవను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. కె.జె వేమలు, ఎ మురళీమోహన్, వెంకట రమణకుమార్, సుబ్రహ్మణ్యం, రామూర్తి రెడ్డి, సులోచన, రాజేంద్ర పాల్గొన్నారు.

ముమ్మారెడ్డి దంపతులకు పరామర్శ

ప్రజాశక్తి - ఓజిలి: ముమ్మారెడ్డి దంపతులను మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి బుధవారం పరామర్శించారు. మండల పరిధిలోని కురుగొండ గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు ముమ్మారెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కురుగొండ గ్రామానికి చేరుకుని ముమ్మారెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ముమ్మారెడ్డి పద్మమ్మ దంపతులను పరామర్శించి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీటీసీ గుంటమడుగు రఘురామ రాజు, వైసీపీ నాయకులు కొండూరు దామోదర రాజు, ముమ్మడి సుబ్బారావు యాదవ్, ముమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బట్టా సుధాకర్ యాదవ్ ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ఆంధ్ర మహిళా మండలి సభ్యులు

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారికి సేవా కార్యక్రమాలు నిర్వహించడం బాధ్యతగా భావిస్తున్నామని ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు స్నేహలత రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణానికి చెందిన భవాని స్టోర్స్ యజమాని కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సహకారంతో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వృద్ధాశ్రమంలో నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు స్నేహలత రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందుకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల పరిశీలన

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గత 12 సంవత్సరాలుగా నిలిచిపోయిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 25 కోట్ల రూపాయల అదనపు నిధులు మంజూరు చేశారు. ఆ పనులు ప్రారంభమయ్యాయని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు. పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను, రాణి పేటలో చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ రోడ్ నిర్మాణానికి సంబంధించి నాయుడుకాలువ పై కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉందని ఈ క్రమంలో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. విద్యుత్ స్తంభాలను ప్రస్తుతం ఉన్న వాటిని తొలగించి వేరే ప్రాంతంలోకి జరపాల్సి ఉందని ఆ పనులు చేపడుతామని వీలైనంత త్వరగా ఆర్ఓబి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునుకూరు కృష్ణయ్య, ముప్పాళ్ల చంద్ర మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

'జగన్నన్నే సిఎం ఎందుకు కావాలి?' కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ శతారాపు బాలయ్య

వైసిపి ప్రభుత్వం పేదల ప్రభుత్వం

- మున్సిపల్ వైస్ చైర్మన్

ప్రజాశక్తి-వెంకటగిరి: వైసిపి పేదల ప్రభుత్వమని మున్సిపల్ వైస్ చైర్మన్ శతారాపు బాలయ్య పేర్కొన్నారు. స్థానిక 4వ సచివాలయంలో 'జగన్నన్నే సిఎం ఎందుకు కావాలి?' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలను అన్నీ నెరవేర్చిన ఆదర్శవంతమైన సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. పేదలకు పథకాలు ఇవ్వడంతో అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పిన టిడిపి నాయకులకు ఇప్పుడు ఎన్నికల్లో పేదలకు ఏమీ చేయలేరన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ పట్టణ కన్వీనర్ గుమ్మడి డిల్లీబాబు, గ్రంథాలయ డైరెక్టర్ పొంతు శరద, 14వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాణి పేటకు చీకటే దారి!

- రాత్రి వేళలో వెళ్లాలంటే గుండెల్లో గుబులు
- విద్యుత్ దీపాలకు కరువైన మున్సిపాల్టీ
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో విద్యుత్ దీపాలు లేక చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా గూడూరు పాత బస్టాండ్ నుండి రాణి పేట మెయిన్ వీధికి వెళ్లాలంటే మహిళలు, చిన్నపిల్లలు భయాందోళనతో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు విద్యుత్ దీపాలు లేనందున వల్ల పాదచారులు, ప్రజలు కనిపించక పోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆ మార్గంలో రాత్రి వేళల్లో అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకింగ్ చేసేవాళ్లు, చర్చికి ప్రార్థనలకు వెళ్లేవారు, అమరావతి హాస్పిటల్, మార్కెట్‌కి వెళ్లే వాళ్లు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు చేసుకునే మహిళలు, యువతులు రాత్రి 8 గంటల తర్వాత వారి ఇళ్లకు ఆ దారిన వెళ్లాలంటే ఏ ప్రమాదం ముంచుకొస్తోందనే భయం వారిని వెంటాడుతుతోంది. వీధి దీపాలు లేకపోవడంతో మద్యం ప్రియులు మద్యం తాగి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దగ్గరికి వెళ్లే వరకు ఆ దారిలో ఎవరూ కనిపించక పోవడం, ఆ తర్వాత ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు లేక అంధకారంలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని గూడూరు మున్సిపల్ కమిషనర్‌కు, అధికారులకు అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజ నం శూన్యంగా ఉందని ఆ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సచివాలయం కూడా ఆ ప్రాంతానికి సమీపంలో ఉండడం విశేషం. ఇప్పటికైనా గూడూరు మున్సిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో జోక్యం చేసుకొని తమ ప్రాంతంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి లైట్లు లేకపోవడంతో చీకటి మయంగా మారిన రాణిపేట రహదారి

సైబర్ క్రైమ్ పోలీసుల పనితీరు భేష్: ఎస్పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరపతి సైబర్ పోలీసుల పనితీరు బాగుందని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ప్రశంసించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా లో పలు విధాలుగా ప్రజలు సైబర్ క్రైమ్ బారిన పడి మోసపోతు న్నారని, పోలీస్ శాఖ కూడా పలు రకాల అవగా హన కార్యక్రమాలు చేపట్టినా అదో రకమైన మోసాలకు ప్రజలు గురవుతు న్నారన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లేదంటే మోసపోతారని హెచ్చరించారు. దీనికి అడ్డు కట్ట వేయాలంటే జాగ్రత్త తప్ప మరో మార్గం లేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదే క్రమంలో సైబర్ బాధితులు క్రైమ్ ఆఫీస్ కి వచ్చిన తరువాత జరిగిన విషయం తెలుసుకొని వారికి మొత్తం గా నగదును ఇప్పిస్తు న్నారని, గత నెలలో 10,28,229 రూపాయల నగదును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేందుకు సైబర్ క్రైమ్ ఎస్ఐ రామచంద్ర రెడ్డి పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ పోలీసు సిబ్బందిని అప్రమత్తంగా వుంటూ తగు చర్యలు తీసుకొని సకాలంలో బాధితులకు న్యాయం చేస్తూ అండగా నిలుస్తు న్నా మన్నారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు పోలీసులను సంప్రదిం చాలని సూచించారు.

కుష్టు వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు..

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కుష్టు వ్యాధిపై నిర్లక్ష్యం తగదని, సూక్ష్మక్రిమి ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుందని, స్పర్శ, నొప్పి, దురద లేని రాగి లేదా బంగారు వర్ణం మచ్చలు శరీరంలో ఎక్కడైనా వస్తే వెంటనే పరీక్షించుకుని వైద్యం పొందాలని బుచ్చినాయుడు కండ్రిగ వైద్యాధికారి మాధవిలత, వైద్యాధికారి దివాకర్ పేర్కొన్నారు. బుధవారం కుష్టు వ్యాధిపై అవగాహనలో భాగంగా వారు మాట్లాడుతూ స్పర్శ, నొప్పి, దురద లేని రాగి లేదా బంగారు వర్ణం మచ్చలు శరీరంలో ఎక్కడైనా వస్తే నరాలపై ప్రభావం చూపి కాళ్ళు, చేతులు వేళ్ళ కుంచించుకు పోయి అంగవైకల్యం ఏర్పడు తుందని, వారి నుండి ఇతరులకు వ్యాపిస్తుందని ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడూ వారి శరీరంపై మచ్చలు ఏవైనా ఉన్నా యా? అని పరీక్షించుకోవాలని, ఆ మచ్చలను వైద్యాధికారికి చూపించి నిర్ధారణ పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఒకవేళ లెప్రసి మచ్చలు అయితే ప్రభుత్వం ద్వారా ఉచితంగా 6 నెలలు పాటు చికిత్స చేసుకుంటే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని మచ్చలు మాయమైపోతాయన్నారు ఇతరులకు వ్యాపించకుండా అరికట్ట వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్టు మెంట్ సూపరువైజరు వెంకటేశ్వర్లు ఏఎన్ఎం గౌరీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఉత్తమ విద్యార్థి అభినందన సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ రాజా రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాజీ రాష్ట్రపతి ఏ పీ జే అబ్దుల్ కలాం పేరు మీదుగా జరిపే ఉత్తమ విద్యార్థి అభినందన సభను జయప్రదం చేయాలని స్థానిక వరదరాజ నగర్ లోని విశ్వం టాలెంట్ స్కూలులో సంకల్ప సేవా సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి, కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, అపుస్మా నాయకులు వెంకటరమణ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎం. ఎం. బి. జీ భాస్కర్ రాజు, విశ్వ చందన్ రెడ్డి, ఓం ప్రకాష్ రెడ్డిలు బుధవారం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నిర్వహించే ఉత్తమ విద్యార్థి అభినందన సభ ఈ నెల 19 న ఆదివారం ఉదయం 10 గంటలకు రాయలచెరువు రోడ్డు లోని ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో నిర్వాహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కు గురువారం బాలాజీ కాలనీ లోని శ్రీ పద్మావతి బాలికల హైస్కూల్‌లో వ్యాస రచన పోటీలు 17 న ఉదయం జీవకోన లోని విశ్వం స్కూల్ లో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ నెల 19 న ఆదివారం జరిగే సభలో తిరుపతి నగరం లోని ప్రభుత్వ ప్రయివేట్ విద్యా సంస్థలలో ప్రథమ ర్యాంక్ వచ్చిన విద్యార్థులకు అబ్దుల్ కలాం అవార్డు ను ఇచ్చి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ పోటీలల్లో పాల్గొనే విద్యార్థులు 9550227479, 9985723962 నెంబర్లను సంప్రదిం చాలని పేర్కొన్నారు.

కంచి మఠంకు ఇచ్చిన పర్మిషన్ రద్దు చేయాలి

విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్ : దక్షణ భారత దేశంలో అగ్రగామి యూని వర్సిటీలలో ఒకటిగా నిలిచిన శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ స్థలాన్ని కంచి మఠానికి సర్వే నెంబర్ 588 లో 13:53 ఎకరాలు భూమిని పాలక మండలి నిర్ణయం లేకుండా, ఏక పక్షంగా పర్మిషన్ ఇవ్వడాన్ని ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కార్యదర్శి సుందర్ మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఉన్నత అధికారులు రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో ఉండి విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వర్సిటీలో చదివే పేద విద్యార్థుల ప్రయోజనాలు వీరికి పట్టవన్నారు. యూనివర్శిటీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తే అంగీకరించేది లేదన్నారు. విసికి చిత్తశుద్ధి ఉంటే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్, జిల్లా అధ్యక్షులు నవీన్, సహాయ కార్యదర్శి రంజిత్, ఏఐఎస్ఎఫ్ తిరుపతి టౌన్ అధ్యక్షులు హరికృష్ణ, ఓం రాజు,దివాకర్, తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూమోనియా లేని బాల్యమే సరైన బాల్యం

ప్రజాశక్తి- రేణిగుంట : న్యూమోనియా లేని బాల్య సరైన బాల్యమని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపరువైజర్ కామరాజు తెలిపారు. బుధవారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట 1 సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సందర్భంగా హెల్త్ సూపరువైజర్ కామరాజు హాజరైన గర్భవతులు, బాలింతలు, ఆశా కార్యకర్తలతో కలిసి సాన్స్ న్యూమోనియా లేని బాల్యమే సరైన బాల్యం అనే ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూమోనియా ప్రమాదకరమైన వ్యాధి అని, 5 ఏళ్ల లోపు వయస్సుగల పిల్లల మరణాలకు ముఖ్య కారణమని హాజరైన వారికి తెలిపారు. న్యూమోనియా నుండి బాల్యం రక్షణ పొందాలంటే తల్లి పాలు బిడ్డ పుట్టిన గంటలోపు పట్టించాలని కనీసం 6 నెలల వరకు తల్లి పాలే శ్రేష్టమన్నారు. ప్రభుత్వం కుష్టువ్యాధి నిర్మూలన మందులను ఉచితంగా ఇస్తోందని తెలిపారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ మలేరియా, బోదకాలు, డెంగీ, చికున్ గున్యా, జికా , మెదడువాపు వంటి దోమల వ్యాధులు విజృంభించి ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తాయనే విషయం వారికి వివరించి వారం వారం ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడేని క్రమంతప్పకుండా గృహస్థులంతా నిర్వహించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో గర్భవతులు, బాలింతలు, ఏఎన్ఎం రేవతి ఆశాకార్యకర్తలు పెనుబాల నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ, ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం బుధవారం నిర్వహించారు. అధ్యక్షులుగా ఓలేటి మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కెఎల్ఎన్ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె హరినాథ్ శెట్టి, కార్యదర్శిగా కెఎస్ విక్రమ్, సహాయ కార్యదర్శిగా సిఎస్ రామకుమార్, కోశాధికారిగా కూరెల్ల కరుణాకర్, సహాయ కోశాధికారిగా కె నరసింహారావు, పిఆర్‌వోగా కె నవీన్ కుమార్ సలహా సంఘం సభ్యులుగా కెవిఆర్ గుప్తా, కె కుప్పయ్య శెట్టి, కెఎస్ ప్రసాద్ శెట్టి, కెఎ ద్వారక చిట్టి సమక్షంలో ఆర్యవైశ్య మహాసభ నిర్వ హించారు. కార్యదర్శి, కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబరు ఎం నరసింహులు, చిత్తూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కరే శ్రీనివాసులు, పి సత్య నారాయణ శెట్టి జక్కా సుబ్బరాజా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సోషల్ మీడియా అధ్యక్షుడు తేజ సమక్షంలో ఈ ప్రమాణ స్వీకారోత్సవ సభ నిర్వహించారు. రాష్ట్ర జిల్లా సంఘం పెద్దల సూచన మేరకు అమ్మవారి ఆస్తులు కాపా డుతూ భూ వివాదాలను పరిష్కరించి అందరూ కలిసికట్టుగా అమ్మవారి సేవలో పాల్గొంటామని తెలిపారు.



టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: బొజ్జల రిషితారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజక వర్గ ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అన్నారు. 'బాబుతో నేను', ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా ఆమె శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డులో పర్యటించారు. స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. బొజ్జల రిషితారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాము పడుతున్న బాధలు గురించి ప్రజలు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా బొజ్జల రిషితారెడ్డి మాట్లాడుతూ తమ మామ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో శ్రీకాళహస్తి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న అభివృద్ధి మొత్తం తమ మామ హయాంలోనిదే అన్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో శాంతి భద్రతలకు ఏనాడూ విఘాతం కలగలేదన్నారు. అయితే వైసీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి శ్రీకాళహస్తిలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కనీస హక్కుల కోసం ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలపై పోలీసులు తప్పుడు కేసులు బనాయిస్తు న్నారని రిషితారెడ్డి వాపోయారు. ఇందులో భాగంగానే తన భర్త బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిం చారన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుపై కూడా జగన్ సర్కారు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిం దన్నారు. ప్రజలు ఇది గమనించి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు అండగా నిలవాలని రిషితారెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తిలో తన భర్త బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు విజయకుమార్ పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల వ తేదీ ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంటు అండ్ ట్రైనింగ్ అధికారులు నిర్వహిస్తున్న జాబ్ మేళాలో 19 కంపెనీలు పాల్గొంటాయని ఎమ్మెల్యే వెలగ పల్లి వరప్రసాద్ రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని మంచి ఉన్నత స్థాయి ఉద్యోగాలలో స్థిరపడాలని కోరు కుంటున్నామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ సహాయకులకు రిఫ్రిజరేటర్లు పంపిణీ చేస్తున్న సహాయ సంచాలకులు శ్రీకాంత్ బాబు

రిఫ్రిజిరేటర్లు పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలా లకు సంబంధించిన రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న 29 మంది పశుసంవర్ధక శాఖ సహాయకు లకు బుధవారం మినీ రిఫ్రిజిరేటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంతీయ పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ పశువుల్లో వ్యాధి చికిత్స కన్నా నివారణ ముఖ్యమన్నారు. వ్యాధి నిరోధక టీకాలను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరిచి, సకాలంలో పశువులకు వినియోగించి, అంటు వ్యాధులు రాకుండా కాపాడా లన్నారు. ఈ కార్యక్రమం లో ఎగువ వీధి పశువైద్యాధికారి డాక్టర్ జి రవీంద్ర వర్మ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేలో అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి పట్టణ పరిధిలోని ఎస్ఆర్ కళ్యాణ మండపంలో అన్నీ శాఖాధికారులతో 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్ డే బుధవారం నిర్వ హించారు. గూడూరు ఆర్‌డిఓ కిరణ్‌కుమార్ పలు సమ స్యలపై అర్జీలు స్వీకరించి సంబంధిత అధికా రులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన అర్జీలు ప్రజా సమస్యలు స్వయంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలి పారు.అపరిష్కృత సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, మండల తహ శీల్దారు పద్మావతి, మున్సిపల్ కమిషనర్ వెంకట రామయ్య, పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి -తొట్టంబేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై బుధవారం కేంద్ర అధికారుల బృందం పరిశీలించింది. శ్రీకాళహస్తిలోని విస్తరణ శిక్షణా కేంద్రానికి ఢిల్లీ నుంచి 35మంది అసిస్టెంటు సెక్షను ఆఫీసర్లు వచ్చారు. వీరితో పాటు రాష్ట్ర అపార్డ్ జాయింట్ డైరెక్టర్ దోసిరెడ్డి హాజరయ్యారు. వీరిలో కొందరు తొట్టంబేడు మండలంలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలో పనిచేసే అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పథకాల క్షేత్రస్థాయి స్థితిగతులు తెలుసుకోవడానికి వీరికి శిక్షణ, క్షేత్ర పరిశీలన ఏర్పాటు చేసినట్లు అపార్డ్ జాయింట్ డైరెక్టర్ దోసిరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. రోడ్లు, పంచాయతీ భవనాలు గురించి తెలుసుకున్నారు. దిశ యాప్ ఎలా అమలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ తెలిపారు. పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ లో గర్భిణులు, బాలింతలకు వారు బుధవారం పౌష్టిక ఆహారం అందించారు. ఫాస్ట్ జోన్ చైర్మన్ ఎం జె ఎఫ్ మురళి నాయుడు సహకారంతో పౌష్టిక ఆహారం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ సేవా కార్యక్రమాలు ప్రతినెలా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో జోన్ చైర్మన్ గురునాథం, ఆర్‌విరావు, సెక్రటరీ గోపీనాథ్ రెడ్డి, మనోజ్ కుమార్, డాక్టర్ రాజా, సూపరింటెండెంటు షరీనా పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారెంటీ: టిడిపి

ప్రజాశక్తి - కోట : కోట మండలం కొత్తపట్నం గ్రామంలో క్లస్టర్ ఇంచా ర్జ పాదర్తి కోటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయ కులు తిరు మూ రు మురళి, చెంగల్ రావు, అనూక్ ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం మాజీ టీడీపీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు, బాండ్‌లు అందించి ప్రచారం చేసి, స్థానికులతో కలసి ప్రజావేదిక సమావేశంను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం చేస్తున్న రాక్షస, కక్ష పూరిత పాలనను వివరించి ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి - సంక్షేమాల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు ఎస్ కే.జలీల్ అహ్మద్, నాయకులు కోకొల్లు మధుయాదవ్, బాబు, శంసుద్దీన్, దారా సురేష్, యనాటి నారాయణ, బాబు, నాయబ్, రసూల్, మండల నాయకులు, స్థానికులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బిసి కుల గణన నిష్పక్షపాతంగా జరగాలి

ప్రజాశక్తి- రేణిగుంట : బిసి కుల గణన నిష్పక్షపాతంగా జరగాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘర్షణ సంఘం అధ్యక్షుడు పూల వెంకటాద్రి యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో పూల వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీల కులగణన బీసీల నాయకులు సమక్షంలో జరగాలన్నారు. అప్పుడే బీసీలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. కొన్ని అగ్రకులాలు నకిలీ సర్టిఫికెట్లతో బీసీల రిజర్వేషన్లలో చొరబడాలని చూస్తున్నారన్నారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బీసీలకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి సంఘర్షణ సంఘం అధ్యక్షుడు పూల వెంకటాద్రి యాదవ్ పేర్కొన్నారు.

క్రైం న్యూస్

తెల్లరాయి అక్రమార్కులపై కేసు నమోదు

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ(పెడేరె డ్డిపల్లి)గ్రామంలో అక్రమంగా తెల్లరాయి జెసిబితో లోడుతున్న వారిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ వీరనారాయణ కథనం మేరకు.. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములలో మంగళవారం అక్రమంగా జెసిబి తో టిప్పర్ లో తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి జెసిబి, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని తమకు అప్పజెప్పడంతో డంపింగ్ చేసిన గోళ్ల జనార్ధన్, జెసిబి ఓనర్ వెంకటేశ్వర్ల రెడ్డి, టిప్పర్ డ్రైవర్, జెసిపి ఆపరేటర్ల పై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఓటింగ్ యంత్రాల చెకింగ్ 'ఓకే' : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్, మాక్ పోల్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్-ఎస్ఆర్ 2024 పైన, రాబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపడుతున్న చర్యలపై సమావేశం నిర్వహించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 16 నుండి చేపట్టిన ఈవీఎం ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని సజావుగా పూర్తి చేయుటలో సహకరించారన్నారు. తిరుపతి జిల్లాకు బెల్ కంపెనీ నుండి 6,780 బ్యాలెట్ యూనిట్లు, 5,335 కంట్రోల్ యూనిట్లు, 6450 వివి ప్యాట్లు వెరసి మొత్తం 18,565 అందాయని తెలిపారు. 17451 ఏటీపీ పరీక్షలో పాస్ అయ్యాయని, 42 బియు లు 7సి.యు లు వెరసి మొత్తం 49 డిఫెక్టివ్ గా గుర్తించామని వాటిని గొడౌన్ లో సీల్ వేసి విడిగా భద్రపరిచామన్నారు. సమీక్షలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి పులివర్తి సుధా రెడ్డి, మనోహరాచారి, వైసిపి చంద్ర మోహన్ రెడ్డి, బిజెపి పురుషోత్తం నాయుడు, కాంగ్రెస్ రవి, ఈఆర్‌ఓలు, శ్రీనివాసులు, ఎన్నికల సెక్షన్ తహశీల్దారు చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక ఎంజీఎం హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మబ్బు సూర్య నారాయణ రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యాస రచన, ప్రసంగం పోటీలు నిర్వహించారు. బహుమతులను ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా.ఆర్. శిరీషా , ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణ రెడ్డి, కార్పొరేటర్ టి. శాలిని, నవ భారత్ సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి రహమతుల్లా షరీఫ్ చేతుల మీదుగా అందిం చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్లు రేవంత్, సురేఖ, పాఠశాల హెచ్ఎం మురుగన్ , స్కూల్ టీచర్లు మధు సూదన్ రెడ్డి, ఎం.ముని శారద, వై.హేమాద్రి పాల్గొన్నారు.

రుయాలో నూతన క్షయ భవనం ఏర్పాటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రుయా ఆసుపత్రిలో నూతన క్షయ వ్యాధి భవనానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహక రించడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. బుధవారం రుయా ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఎంతోకాలంగా క్షయ వ్యాధి గ్రస్తులకు రుయా ఆసుపత్రి నందు నూతన భవన నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న సమ యంలో టీటీడీ దేవస్థానం కోటి 79 లక్షలు సహాయం అందిం చడం వల్ల క్షయ వ్యాధి గ్రస్తులకు మెరుగైన వైద్యం అందిం చవచ్చన్నారు. నాడు నేడు కింద 50 పడకల వసతితో క్రిటికల్ కేర్ బ్లాక్ 23.75 కోట్లతో త్వరలో నిర్మాణం సాగుతోందన్నారు. 25.44 కోట్ల తో అక్యుట్ కేర్ విభాగం, వైద్య విద్యార్థు లకు లెక్చరర్ గ్యాలరీ సుమారు 26.91 కోట్లతో నిర్మాణం జరుగుతోంద్నారు. విభాగాధి పతి డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ టీటీడీ పాలక మండలి సమా వేశంలో ఇలాంటి మంచి నిర్ణయం తీసుకోవడం తిరుపతి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రిసెట్ రాష్ట్రస్థాయి ర్యాంకులు..

ప్రజాశక్తి -కోట : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం బి.ఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలో రాష్ట్రస్థాయిలో విత్తన సాంకేతిక పరిజ్ఞానవిభాగంలో కుర్తాడి.శివ శంకర వరప్రసాద్ 8వ ర్యాంకును,జామ్ మీనాక్షి 32 వ ర్యాంకు, సాలాడి మౌనిక 27వ ర్యాంకులను సాధించారని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎరుకుల.గోపి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థి, విద్యార్థులను ఇంతటి ప్రగతిని సాధించడానికి కృషి చేసిన అధ్యాపక సిబ్బందిని ఎన్ బి కే ఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి. రామ్ కుమార్ అభినందించారని పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపాల్ ఎరుకల గోపి తెలిపారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.NO. 9 / 2021

1. కుందం శ్రీనివాసులు రెడ్డి
2. కుందం శైలజ ...పిటీషనర్స్

Vs

1. తాటిపర్తి జనార్ధన్ రెడ్డి మరియు 13 ఇతరులు ....రెస్పాండెంట్లు

నోటీసు

టు R10). యరమాకు శ్రీకాంత్ రెడ్డి, తండ్రి. వెంకటేశ్వర్లు రెడ్డి, జయంపు గ్రామం, బాలాయపల్లి మండలం, తిరుపతి జిల్లా.

పైన పేర్కొనబడిన పిటిషనర్లు పై నెంబర్ గల పిటిషను నందు వారిని దివాలాదారులుగా నిర్ధారించమని పై కోర్టు వారిని కోరడమైనది. సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తేది. 24-11-2023కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు,
పట్నం. శ్రీనివాసులు, ఎం.కామ్, ఎల్.ఎల్.బి.,
పిటిషనర్లు తరపు న్యాయవాది,
గూడూరు సెల్ : 9949454910

ఆక్షేపణ నోటీసు

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

I.A.NO. 107 / 2022, O.S.NO. 284 / 2019

నంది మండలం అబ్బిరాజు ...పిటిషనరు/వాది

Vs

1. మేరిగ నందకుమార్(Died) వగైరాలు ....రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

1. మేరిగ నారాయణమ్మ
2. మేరిగ ప్రియాంక
3. మేరిగ మౌనిక
4. మేరిగ తేజ

మైనరు అయినందున గార్డియన్‌గా తల్లి మేరిగ నారాయణమ్మ .....LRs / Proposed Party

సదరు నెంబరులోని మేరిగ నందకుమార్ చనిపోయినందున మిమ్ములను వారసులుగా చేర్చమని కోరుతూ పిటిషన్ పెట్టియున్నందున మీకు ఆక్షేపణలు ఉన్నయెడల తేది. 04-12-2023 కి ఉదయం 10 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
ఎ. విజయభాస్కర్, బి.ఎస్సీ., బి.ఎల్.,
వాది అడ్వకేటు